# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-05-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రపంచంలో 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించడం గర్వకారణమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు.**
2. **తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమం ఈరోజు కడపలో ప్రారంభమైంది.**
3. **ప్రజలకు యోగా ఆవశ్యకతను తెలియజేసేలా రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.**
4. **ప్రముఖ సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతి ఈరోజు.**

==========================

ప్రపంచంలో 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించడం గర్వకారణమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. గుజరాత్‌లో పర్యటిస్తున్న ఆయన ఈరోజు 5 వేల 536 కోట్ల రూపాయలతో ఆ రాష్ట్రంలో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ..

..వాయిస్.. 24 సెకన్లు

--------------------------

రాష్ట్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. వైయస్సార్ కడప జిల్లాలో ఈరోజు ప్రారంభమైన తెలుగు దేశం పార్టీ మహానాడు కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కడపలో తొలిసారి మహానాడుని ఏర్పాటు చేశామని తెలిపారు. మారుతున్న కాలానుగుణంగా పార్టీలోనూ సంస్థాగత మార్పులు అవసరమని చంద్రబాబు నాయుడు పేర్కొంటూ...

..వాయిస్.. 35 సెకన్లు

కాగా.. 'సుస్థిర ప్రభుత్వంతోనే స్వర్ణాంధ్ర కల సాకారం' అనే ఇతివృత్తంతో 3రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుంది. మహానాడులో టీడీపీ భవిష్యత్ లక్ష్యాలకు అనుగుణంగా ఆరు ప్రధాన అంశాల ప్రాతిపదికగా చర్చించనున్నారు.

--------------------------

ప్రజలకు యోగా ఆవశ్యకతను తెలియజేసేలా రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఈ ఉదయం యోగాంధ్ర రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... యోగాను నిత్య జీవితంలో అంతర్భాగంగా చేసుకోవాలని ప్రజలంతా యోగాభ్యాసం చేయాలని కోరారు.

---------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం జూన్ 21వ తేదీ వరకు యోగాంధ్ర–2025 పేరుతో నెలరోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా తూర్పుగోదావరి, చిత్తూరు, బాపట్ల, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో ఈరోజు నిర్వహించిన యోగా కార్యక్రమాల్లో పలువురు అధికారులు పాల్గొని యోగాసనాలను వేశారు. ఇందులో భాగంగా కృష్ణాజిల్లా మచిలీపట్నంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ డి.కె. బాలాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

..వాయిస్.. 28 సెకన్లు

---------------------------

రాష్ట్ర ఇన్చార్జి డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డిజిపిగా కొనసాగుతున్న హరీష్ కుమార్ గుప్తాకు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఈ పదవిలో రెండు సంవత్సరాలు పాటు కొనసాగుతారు. హరీశ్‌కుమార్ గుప్తా 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. జమ్మూకశ్మీర్‌కు చెందిన ఆయన.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఖమ్మం ఏఎస్పీగా తన తొలి పోస్టింగ్ పొందారు. ఈ సంవత్సరం జనవరి 31న అప్పటి డీజీపీ ద్వారకాతిరుమల రావు పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం హరీష్ కుమార్ గుప్తాను ఇన్చార్జి డిజిపిగా నియమించింది. తాజాగా పూర్తిస్థాయిలో బాధ్యతలు అప్పగించింది.

---------------------------

ప్రజల్లో విద్యుత్ పంపిణీ వ్యవస్థపై సంతృప్తికర స్థాయిలో నమ్మకం పెంచాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ విద్యుత్ అధికారులకు ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి డిస్కమ్ ల అధికారులతో దృశ్య మాధ్యమ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లో వోల్టేజ్ , ట్రాన్స్‌ఫార్మర్ సమస్యలపై ప్రజల నుంచి వినతులు వచ్చినప్పుడు అధికారులు తక్షణం స్పందించి, చర్యలు చేపట్టాలని డిస్కం అధికారులకు సూచించారు.

---------------------------

ఆపరేషన్ సిందూర్ విజయానికి మద్దతుగా, భారత సైనికుల పరాక్రమానికి దేశం గౌరవ వందనంను తెలుపుతోంది. సాయుధ దళాలకు సంఘీభావంగా, ఆకాశవాణి వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. ఇందులో భాగంగా 1962 భారత్–చైనా యుద్ధంలో అత్యున్నత త్యాగం చేసిన మేజర్ షైతాన్ సింగ్ గురించి ఈరోజు తెలుసుకుందాం.

వాయిస్ ... 45 సెకన్లు

---------------------------

నవయుగ వైతాళికుడు, సంఘసంస్కర్త, బహు గ్రంథకర్త... కందుకూరి వీరేశలింగం పంతులు వర్థంతి ఈరోజు. వితంతు పునర్వివాహం, బాల్య వివాహాల నిర్మూలన కోసం కృషిచేసిన వీరేశలింగం పంతులు ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో హితకారిణి సమాజం స్థాపించి మహిళల అభ్యున్నతికోసం పాటుపడ్డారు. సమాజహితం కోసం తన జీవితాంతం పోరాడిన కందుకూరు వీరేశలింగం 1919, మే 27న మద్రాసులో తుది శ్వాస విడిచారు.

---------------------------

అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ– సి ఆర్ డి ఏ కమిషనర్ కన్నబాబు అన్నారు. రాజధానికి అవసరమైన నిర్మాణపరమైన వసతుల కల్పనలో భాగంగా ఆయన చండీగఢ్‌లో నిన్న పర్యటించి పలు భవనాల ఆకృతులను పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పర్యటనలో తాము పరిశీలించిన అనేక విషయాలు, ప్రపంచ స్థాయి పట్టణ ప్రణాళిక, పాలన ప్రమాణాలకు అనుగుణంగా అమరావతిని అభివృద్ధి చేసేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.

---------------------------

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం కమినిలంక వద్ద గోదావరిలో గల్లంతైన యువకుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. వారిలో నాలుగు మృతదేహాలు ఈ ఉదయం లభ్యమయ్యాయని అధికారులు తెలిపారు. మరో నలుగురి ఆచూకీ కోసం రెవెన్యూ పోలీస్, విపత్తు బృందాల ఆధ్వర్యంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయన్నారు. నిన్న నదీస్నానానికి వెళ్లగా ప్రమాదవశాత్తూ ఈ ఎనిమిది మంది మునిగిపోయారు.

---------------------------

రాష్ట్రంలోని రాయలసీమ ప్రాంతాలకు నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయని మిగతా ప్రాంతాలకు విస్తరించేందుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఈరోజు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారి ఎం. వెంకటరావు వెల్లడిస్తూ ...

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

తలసేమియా బాధితుల కోసం రేపు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం జాయింట్ సెక్రటరీ సాయి ప్రసాద్ తెలిపారు. విజయవాడలో నిన్న ఆయన పాత్రికేయలతో మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల సంఘం, రెడ్ క్రాస్ విజయవాడ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

=====================